

అన్నదాతకు అపార నష్టం

ప్రస్తుత వర్షాలతో పంటలు నీట మునిగి దెబ్బతింటున్నాయి. దీంతో రైతులకు అపార నష్టం కలుగుతోంది. 8లో▸



పర్యాటకుల తాకిడి

వికారాబాద్ సమీపంలోని అనంతగిరి గుట్ట, ధారూరు కోట్‌పల్లి ప్రాజెక్టుకు ఆదివారం పర్యాటకుల తాకిడి పెరిగింది. 8లో▸



బిల్లులు రాక.. వెతలు తీరక!

ఆరు నెలలుగా మధ్యాహ్న భోజన బిల్లులు రాక ఇబ్బంది పడుతున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

ప్రశాంతంగా గ్రామ పాలనాధికారి పరీక్ష

కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ ప్రతీక్‌జైన్



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

అనంతగిరి: గ్రామ పాలనాధికారి, లైసెన్స్‌డ్ సర్వేయర్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. ఆదివారం వికారాబాద్‌లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. అభ్యర్థుల హాజరు వివరాలపై ఆరా తీశారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగిన గ్రామపాలన అధికారి పరీక్షకు 83 మంది అభ్యర్థులకు 66 మంది పరీక్ష రాయగా.. 17మంది గైర్హాజరు అయ్యారని కలెక్టర్ తెలిపారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ల పరీక్ష ఉదయం సెషన్‌లో 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగిన పరీక్షకు 139 మంది అభ్యర్థులకు 121 మంది హాజరు కాగా.. 18 మంది గైర్హాజరు అయినట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం సెషన్ 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు జరిగే పరీక్షను కట్టుదిట్టంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. పోలీసు బందోబస్తుతో పాటు ఎలాంటి మాస్ కాపీయింగ్ జరగకుండా చూడాలని ఆదేశించారు. కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, ఆర్డీఓ వాసుచంద్ర, డీటీడీఓ కమలాకర్ రెడ్డి, మైనార్టీ వెల్ఫేర్ రాజేశ్వరి, తహసీల్దార్ లక్ష్మీ నారాయణ, పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ నెమత్ అలీ తదితరులు ఉన్నారు.

రూ.230 కోట్లతో అభివృద్ధి పనులు

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

యాలాల: మండలంలో కొత్త సబ్ స్టేషన్లతో పాటు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి రూ.230 కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన శంకుస్థాపనలు చేసే ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యాలాల మండలం దౌలాపూర్ సమీపంలో ఆరు సబ్‌స్టేషన్లు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణం చేపట్టనున్నామని తెలిపారు. ఆయా అభివృద్ధి పనులను డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు మంగళవారం శంకుస్థాపన చేయనున్నారని వెల్లడించారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజేష్‌నాయక్

కొడంగల్ రూరల్: గిరిజనుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని లంబాడ హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్‌నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో సమితి 29వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తండాలను పంచాయతీలు, రెవెన్యూ గ్రామాలుగా ఏర్పాటు చేయాలని కోరారు. తండాల అభివృద్ధికి బోర్డు ఏర్పాటు చేయాలని, ఇటీవల చేసిన కులగణనలో లంబాడ జనాభాను వెల్లడించాలని డిమాండ్ చేశారు. 28న గిరిజన సంక్షేమ భవనంలో ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ సమావేశం, 31న నగరంలోని అశోకా కాంప్లెక్స్ శాంతి చక్రహాల్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమితి జిల్లా నాయకులు బాలకృష్ణ, మోతీలాల్‌నాయక్, శుభాష్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, సమ్యానాయక్, ఉమల్లీబాయి పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు

మొయినాబాద్‌రూరల్: తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ వికారాబాద్ మహిళా డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ కోట ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని తోల్‌కట్ట సమీపంలో కొనసాగుతున్న కళాశాలలో బీఎస్సీ ఎంపీసీఎస్, ఎంఎస్‌సీఎస్, బీఏ, హెచ్‌ఈపీ కోర్సుల్లో చేరేందుకు ఎస్సీ మహిళా అభ్యర్థులు ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తులు నేరుగా కళాశాలలో సమర్పించాలని సూచించారు. దరఖాస్తుకు 10వ తరగతి, ఇంటర్ మెమో, టీసీ జిరాక్స్ కాపీలు, 2025 జనవరి 01 తర్వాత జారీ చేసిన ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం, ఐదు పాస్ ఫొటోలు జతచేయాలని తెలిపారు. వివరాలకు 98855 04397 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

లోటు తీరింది..

మొన్నటి వరకు అడుగంటి ఆందోళనకు గురిచేసిన జలాశయాలు, చెరువులు నేడు జలకళతో ఆ లోటు తీర్చాయి. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు నిండుకుండల్లా తొణికిసలాడుతూ కనువిందు చేస్తున్నాయి. సాధారణ వర్షపాతం కంటే అధికంగా నమోదై చెరువులు అలుగు పారుతున్నాయి.



అలుగు పారుతున్న కాకరవాణి ప్రాజెక్టు

విస్తారంగా వర్షాలు

- నిండుకుండల్లా జలాశయాలు
- అలుగు పారుతున్న చెరువులు
- జిల్లాలో అధిక వర్షపాతం నమోదు
- జూలైలో సాధారణ వర్షపాతం 165 మిల్లీమీటర్లు
- నమోదు 235 మి.మీ.

వికారాబాద్: ఎడతెరపి లేని వర్షాలతో జిల్లాలోని ప్రాజెక్టులు, చెరువులు, కుంటలకు జలకళ సంతరించుకుంది. చెరువుల్లో వాటర్ సర్‌ప్లస్ అయింది. ఏటా ఆగస్టు, సెప్టెంబర్ నెలలో కానీ అలుగు పోయని చెరువులు.. ప్రస్తుతం జూలై మాసం పూర్తి కాకుండానే పూర్తి స్థాయిలో నీరు చేరి ఆకట్టుకుంటున్నాయి. తొలుత జూన్, జూలై 20వ తేదీ వరకు జిల్లాలో లోటు వర్షపాతం నమోదై ఆందోళన కలిగించినా.. ఆ తరువాత మోస్తరు నుంచి కుండపోత పోయడంతో సాధారణకు మించి వర్షపాతం నమోదు అయింది. జిల్లా పరిధిలోని 15కు పైగా మండలాల్లో అధిక వర్షపాతం నమోదు కాగా.. మిగతా మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు అయింది. దీంతో చెరువులు, కుంటలు నిండి అలుగు పారుతుండటంతో పాటు కొందరికి మోదం కొందరికి ఖేదంలా మారింది. వరినాట్లు వేసుకునే రైతులకు అధిక వర్షాలు ఆశాజనకంగా మారగా, ఆరు తడి పంటలు వేసిన వారి పొలాలన్నీ జాలువారి పంటలు పాడయ్యే పరిస్థితి నెలకొంది. అయితే జిల్లాలో ఇప్పటికే సాధారణకు మించి వర్షపాతం నమోదుకావటంతో జూలై మాసం పూర్తి కాకుండానే చెరువులు నిండిపోయాయి. సామాన్యమైన వర్షపాతం 165 మిల్లీ మీటర్లు కాగా.. ప్రస్తుతం 235 మిల్లీమీటర్లుగా నమోదయింది.

ప్రాజెక్టుల్లో జలకళ

జిల్లాలో మొత్తం చెరువులు 1187 ఉన్నాయి. అందులో చాలా వరకు నీటితో పూర్తిగా నిండిపోయాయి. ప్రస్తుతం 62 చెరువులు అలుగు పోస్తుండగా, మరో 194 చెరువులు పూర్తిస్థాయి నీటి మట్టానికి(వందశాతం) చేరుకుని మత్తడి దుంకేందుకు సిద్ధంగా ఉన్నాయి. జిల్లాలోని చెరువుల్లో ఫీడర్ చానల్స్(పాటు కాల్వలు) సరిగ్గాలేని, ఆక్రమణలకు గురైన చెరువులు ఇంకా అలుగు పారటంలేదు. అయితే ప్రధాన ప్రాజెక్టులు అన్ని ఇప్పటికే వంద శాతం నిండుకున్నాయి. లఖ్నాపూర్, కాకరవాణి, నందివాగు, అల్లాపూర్ అలుగు పోస్తుండగా, శివసాగర్ మత్తడి పోసేందుకు సిద్ధంగా ఉంది. సర్పన్‌పల్లి, జుంటుపల్లి ప్రాజెక్టులు అలుగు పారేందుకు మరో రెండు ఫీట్లు నిండాల్సి ఉంది. ఇప్పటికీ వరద ఉధృతి కొనసాగుతున్న నేపథ్యంలో.. వర్షాలు ఇలాగే కొనసాగుతే మరో రెండు మూడు రోజుల్లో మొత్తం చెరువులు పొంగిపొర్లే అవకాశం ఉందని నీటి పారుదల శాఖ అధికారులు పేర్కొంటున్నారు. కలెక్టర్, ఎస్పీలతో పాటు జిల్లా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో ప్రాజెక్టులను పరిశీలిస్తున్నారు. పరిస్థితిని అంచనా వేస్తూ, ఎప్పటికప్పుడు యంత్రాంగానికి సలహాలు, సూచనలు చేస్తున్నారు.

జాలుపారుతున్న పొలాలు

జిల్లాలో మొత్తం 5.61 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తుండగా, ఇప్పటికే 4 లక్షల ఎకరాల్లో రైతులు సాగు చేశారు. మరో 1.61 లక్షల ఎకరాలు సాగవనుందని పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా.. భారీ వర్షాలతో వరినాట్లకు సిద్ధమైన అన్నదాతల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఇదే సమయంలో ఇప్పటికే ఆరుతడి పంటలు సాగు చేసిన రైతులు ఆందోళనకు గురవుతున్నారు. సుమారు 50 శాతం పంట పొలాలు ప్రస్తుతం జాలువారే పరిస్థితి కనిపిస్తోంది. ప్రస్తుత వానలకు జిల్లాలో పది ఇళ్లు కూలిపోయాయి. మూసీ పరివాహక ప్రాంతంతో పాటు ఆయా మండలాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. ఇలాగే వర్షాలు కొనసాగితే జాలువారి పంటలన్నీ పాడయ్యే ప్రమాదం పొంచి ఉందని కర్షకులు కలవర చెందుతున్నారు. వరుణుడి శాంతించి, భానుడి కరుణిస్తే కానీ.. పంటలు చేతికి వస్తాయని ఆశిస్తున్నారు. ఎడతెరపి లేని వర్షాలు పాడి రైతులకు ఆనందాన్ని తెచ్చిపెట్టగా.. ఆరుతడి పంటలు వేసే వారు.. పది రోజుల క్రితం వరకు వర్షాలు లేక ఆందోళన చెందగా.. అధిక వర్షాలతో ఆందోళన చెందుతున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి



అధిక వర్షాలతో రైతులు జాగ్రత్తగా ఉండాలి. పంటలు జాలువారి పాడవటమే కాకుండా.. పంటలకు చీడపీడలు ఆశించే ప్రమాదం ఉంది. పంట పొలాల్లో నిల్వ ఉన్న నీటిని పారదోలాలి. పత్తి, కంది తదితర పంటల ఆకులు ముడతలు రాకుండా ఉండేందుకు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనల మేరకు మందులు పిచికారీ చేసుకోవాలి.

– రాజరత్నం, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి

చెరువుల వద్దకు వెళ్లరాదు



సర్పన్‌పల్లి ప్రాజెక్టును పరిశీలిస్తున్న కలెక్టర్

అనంతగిరి: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు ప్రాజెక్టులు, చెరువుల దగ్గరకు వెళ్లరాదని కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. ఆదివారం ఆయన.. ఇరిగేషన్ అధికారులతో కలిసి సర్పన్‌పల్లి ప్రాజెక్టును సందర్శించారు. నీటి సామర్థ్యం గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడైనా లీకేజీలు ఉన్నాయా అని ఆరాతీశారు. కింది భాగం వాటర్ ఫ్లో ఉండేలా చూడాలని ఆదేశించారు. చుట్టు పక్క గ్రామాల వారు జలాశయాల సమీపానికి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట ఇరిగేషన్ ఈఈ మధుసూదన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

కాగ్నా వంతెనపై గుంత

- బ్రిడ్జిని పరిశీలించిన సబ్ కలెక్టర్, డీఎస్పీ
- నాసిరకం పనులే కారణం: కాంగ్రెస్ నేతలు

యాలాల: తాండూరు– కొడంగల్ ప్రధాన దారిలోని కాగ్నా నది వంతెనపై భారీ గుంత ఏర్పడింది. ప్రస్తుత వర్షాలకు తారు పోయి, సిమెంటు బెడ్డుకు పూర్తిగా రంధ్రం ఏర్పడి ప్రమాదకరంగా మారింది. ఆదివారం ఉదయం దీనిని గుర్తించిన వాహనదారులు.. పోలీసులు, అధికారులకు సమాచారం ఇవ్వగా.. తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, తహసీల్దార్ వెంకటస్వామి గుంతను పరిశీలించారు.

రెండేళ్ల క్రితం రాకపోకలు షురూ

ఈ మార్గంలోని కాగ్నా నదిపై ఉన్న పాత బ్రిడ్జి 2015లో వచ్చిన భారీ వరదలకు కోతకు గురైంది. దీంతో నూతన వంతెన నిర్మాణం అనివార్యమయింది. ఇందుకు రూ.16.80 కోట్లను 2016లో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ శాఖ పర్యవేక్షణలో కొత్త బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. అనంతరం రెండేళ్ల క్రితం నుంచి కొత్త వారధి పై నుంచి వాహనాల రాకపోకలకు సర్కారు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కాగా.. ఆదివారం బ్రిడ్జిపై ఏర్పడిన గుంతను పరిశీలిస్తే.. నాసిరకమైన పనులే ఇందుకు కారణమని తెలుస్తోంది. అయితే గుంత ప్రదేశంలో మరమ్మతులు చేపట్టాలంటే కింద ప్రవహిస్తున్న ప్రవాహం నుంచి పైకి సపోర్టుగా కర్రలు, కడ్డీలు ఏర్పాటు చేయాల్సి ఉంది. గుంత ఏర్పడిన ప్రదేశం మొత్తం తొలగించి, కొత్తగా సిమెంటు బెడ్డు వేస్తేనే పరిష్కారమార్గం లభించనుందని అధికారులు భావిస్తున్నారు. అయినప్పటికీ.. ప్రస్తుతం మరమ్మతు పనులు చేపట్టడం చాలా కష్టమనే తెలుస్తోంది. ఇదిలా ఉండగా.. వంతెనకు రంధ్రం ఏర్పడటాన్ని పరిశీలిస్తే.. ఇందుకు నాసిరకమైన పనులే కారణమని కాంగ్రెస్ నేత శ్రీనివాస్ రెడ్డి, సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి అనుమానం వ్యక్తంచేశారు. గత ప్రభుత్వం చేపట్టిన పనులకు ఈ బ్రిడ్జి అద్దం పడుతుందని పలువురు ఆరోపించారు.



గుంతను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, డీఎస్పీ బాలకృష్ణారెడ్డి తదితరులు

బీఆర్‌ఎస్ పతనానికి నిదర్శనం

ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి



వంతెనను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

తాండూరు: బీఆర్‌ఎస్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులు, బ్రిడ్జిలు వారి కళ్ల ముందే కుంగిపోవడం వారి పతనానికి ఇదే నిదర్శనమని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి విమర్శించారు. కాగ్నా నది బ్రిడ్జిపై ఏర్పడిన రంధ్రాన్ని ఆయన.. ఆదివారం సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్‌తో కలిసి పరిశీలించి మాట్లాడారు. అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మూడేళ్ల క్రితం నిర్మించిన వంతెన కుంగిపోవడం చూస్తుంటే.. వారికి కమీషన్‌లపై ఎంత శ్రద్ధ ఉందో అర్థమవుతుందని ఆరోపించారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మీనం మెరిసే.. జాలర్లు మురిసే

కోట్‌పల్లి జలాశయంలో చేపల వేట



పది కిలోల చేపతో జాలరి

ధారూరు: ప్రస్తుత వర్షాలతో కోట్‌పల్లి జలాశయం నిండుకుండలా మారగా.. అందులో భారీగా చేపలు కనువిందు చేస్తున్నాయి. ఏరుకు ఎదురీదుతూ జాలర్లకు వరంలా మారాయి. జోరు వానలతో ధర్మాపూర్ వాగు పరవళ్లు తొక్కుతోంది. ఈ క్రమంలో ప్రాజెక్టులోని చేపలు వాగులోకి ప్రవేశిస్తున్నాయని తెలుసుకున్న పరిసర ప్రాంత ప్రజలు, జాలర్లు.. మత్స్య వేటలో నిమగ్నమయ్యారు. ఒక్కొక్కరికి 5 నుంచి 25 కిలోల బరువున్న చేపలు దొరకగా.. వారు ఆనందం వ్యక్తంచేశారు. అనంతరం వాటిని తాండూరు, వికారాబాద్ పట్టణాలకు తరలించి విక్రయించారు. చాలా మంది వాగు వద్దకే వచ్చి జాలర్ల వద్ద చేపలను కొనుగోలు చేశారు. వాగు ప్రవాహం కొనసాగుతున్న పరిసర గ్రామాలు ధర్మాపూర్, కొండాపూర్‌కలాన్, నర్సాపూర్, గడ్డమీది గంగారం ప్రజలు చేపలను పట్టుకున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 14.6 అడుగుల నీరు చేరింది.

'స్థానిక'ఎన్నికల్లో సత్తా చాటాలి

బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్



చేవెళ్ల: మాట్లాడుతున్న రాజ్‌భూపాల్‌గౌడ్

చేవెళ్ల: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటేలా పార్టీ శ్రేణులు పనిచేయాలని ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్ గౌడ్ అన్నారు. ఆదివారం పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్నికల సన్నద్ధత సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన రాజ్‌భూపాల్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం ఎన్నికల వ్యూహాలను వివరించారు. ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. కేంద్రంలో మోదీ అనుసరిస్తున్న విధానాలు, అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలిపితేనే నమ్మకం ఏర్పడుతుందని తెలిపారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు అంజన్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాములుగౌడ్, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కంజర్ల ప్రకాశ్, మండల ప్రభారి ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు బి.కుమార్ గౌడ్, వాసుదేవ్ కన్నా, మండల నాయకులు, బూత్‌స్థాయి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధే ప్రధాని లక్ష్యం

మొయినాబాద్‌రూరల్: భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశాభివృద్ధే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్ గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరాంనగర్ ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.రత్నం అన్నారు. ఆదివారం నరేంద్రమోదీ నిర్వహించిన మన్‌కీ బాత్‌ను వారు పార్టీ కార్యాలయంలో వీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అత్యంత విశ్వసనీయత కలిగిన నేత మోదీ అన్నారు. అమెరికాకు చెందిన ఇంటెలిజెన్స్ సంస్థ చేపట్టిన సర్వేలో ప్రధానికి ప్రపంచంలో 75 శాతం అప్రూవల్ రేటింగ్ వచ్చిందని చెప్పారు. మన్‌కీబాత్‌లో మోదీ మాట్లాడుతూ.. మన సంస్కృతిలో విజ్ఞానం దాగి ఉందని, అంతరిక్షంలోకి వెళ్లిన శుభాన్షు శుక్లా సురక్షితంగా తిరిగి వచ్చిన తరువాత ప్రతి ఒక్కరిలో ఆత్మ విశ్వాసం పెరిగిందని చెప్పారని వివరించారు. వేస్ట్ మెనేజ్‌మెంట్‌ను అలవాటు చేసుకోవాలని సూచించారన్నారు. కార్యక్రమంలో ఓబీసీ నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటేశ్ గౌడ్, నర్సింహారెడ్డి, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కళలకు పుట్టినిల్లు తెలంగాణ

- కవులు, కళాకారులకు మరణం లేదు
- వారి జ్ఞాపకాలు జీవించే ఉంటాయి
- స్పీకర్ ప్రసాద్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్ కుమార్

అనంతగిరి: 'కవులు, కళాకారులు, రచయితలకు పుట్టినిల్లు తెలంగాణ. తమ రచనలతో సమాజాన్ని కదిలించే శక్తి కలిగిన వారు. అందుకే వారికి సమాజంలో ఎల్లప్పుడూ ఆదరణ ఉంటుంది. వారికి మరణం లేదు. భౌతికంగా దూరమైనా.. వారి చేతి నుంచి జాలువారిన పద, జ్ఞాన సంపద ఎల్లకాలం జీవించే ఉంటుంది' అని శాసనసభ సభాపతి ప్రసాద్ కుమార్ అన్నారు. సామాజిక అంశాలైనా, జీవన చిత్రాలైనా, విప్లవ గీతాలైనా స్పందించే సృజనాత్మకమైన మనసు ఇక్కడి ప్రజలకు ఉందని, ఆ కోవలోనే సాహితీ రంగంలో రాష్ట్రానికి రెండు కళ్లలాంటి వారు దాశరథి కృష్ణమాచార్యులు, సింగిరెడ్డి నారాయణ రెడ్డి అని పేర్కొన్నారు. ఆదివారం వికారాబాద్ పట్టణంలోని ఆర్యవైశ్య భవనంలో అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో కవి, రచయిత దాశరథి, సినారే జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దాశరథి.. ప్రజా సమస్యలు, నిరంకుశత్వంపై తిరుగుబాటు ధోరణి, ప్రజలను చైతన్యవంతం చేసే పదజాలంతో రచనలు చేశారని తెలిపారు. నా తెలంగాణ కోటి రతనాల వీణ అంటూ ప్రపంచానికి తెలంగాణ గొప్పతనాన్ని ఎలుగెత్తి చాటి, రాష్ట్ర ఉద్యమానికి ప్రేరణగా నిలిచారని కొనియాడారు. దాశరథికి 1974లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించడం వారి కవితా ప్రతిభకు ఒక మచ్చు తునక అని పేర్కొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి 'సినారే'

ఆధునిక తెలుగు సాహితీ రంగంలో సినారే అంతటి గొప్ప వ్యక్తి మరొకరు లేరని సభాపతి అన్నారు. కవిగా, సాహితీవేత్తగా, రచయితగా బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. ఆయన ప్రతిభను గుర్తించి జ్ఞానపీఠ పురస్కారం, పద్మశ్రీ, పద్మభూషణ్, నంది లాంటి అవార్డులు, రివార్డులు, గౌరవ డాక్టరేట్లు ఇలా ఆయనను ఎన్నో వరించాయని తెలిపారు. అద్భుతమైన సినీ గీతాలను రచించి సంగీత అభిమానులను అలరింపచేశారని గుర్తుచేశారు. అలాంటి గొప్ప కవులు, రచయితలైన దాశరథి, సినారేని గౌరవిస్తూ వారి జయంతి వేడుకలను నిర్వహించిన మీ అందరినీ మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని తెలిపారు. ఈ సందర్భంగా వారి జీవితాలను తెలిపే నాటకాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ నర్సింహులు గుప్తా, ప్రముఖ కవి దొరవేటి చెన్నయ్య, ఆర్టీఏ సభ్యులు జాఫర్, డీసీసీబీ డైరెక్టర్ కిషన్ నాయక్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్ కుమార్, అనంత సాహితీ వేదిక ప్రతినిధులు, కవులు, కళాకారులు పాల్గొన్నారు.

సంజీవనిలా 108

- 16 రాష్ట్రాల్లో సేవలు అందిస్తున్న వైఎస్సార్ ప్రవేశపెట్టిన పథకం
- అత్యవసర సమయాల్లో మెరుగైన సేవలు
- ఆపద్బాంధవులు 108 సిబ్బంది



అంబులెన్స్‌లో గర్భిణికి ప్రసవం చేసిన సిబ్బంది(ఫైల్)

కందుకూరు: దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన 108 అంబులెన్స్ పథకం దేశవ్యాప్తంగా ఆదరణ పొందుతోంది. ప్రమాదం జరిగి ఆపదలో ఉన్న వారికి సంజీవనిలా మారింది. ప్రజలకు ఎక్కడ ఎలాంటి ప్రమాదం చోటు చేసుకున్నా మొదట గుర్తొచ్చేది 108. సంఘటన చూసిన ప్రతి ఒక్కరు 108కి కాల్ చేయడమే తమ మొదటి ప్రాధాన్యతగా మారింది. ఇందుకు కారణం అత్యవసర సమయాల్లో చికిత్స అందడంతో పాటు సకాలంలో క్షతగాత్రులు, రోగులను ఆస్పత్రులకు తరలిస్తారు. ప్రస్తుతం దేశంలోని 16 రాష్ట్రాల్లో ఈ పథకం అమలవుతోంది.

అత్యవసర సేవలు

108 అంబులెన్స్ వాహనంలో అత్యవసర సేవలు అందించడానికి శిక్షణ పొందిన ఈఎంటీ, పైలెట్ అందుబాటులో ఉంటారు. అవసరమైన రోగులు, క్షతగాత్రులను సకాలంలో ఆస్పత్రులకు చేర్చడంతో పాటు వాహనంలోనే ప్రథమ చికిత్స అందిస్తారు. గుండె నొప్పి వస్తే ఏఈడీ పరికరం, దానికి సంబంధించిన మందులు అందుబాటులో ఉంచారు. ఆక్సిజన్ పరికరాలు, ఆక్సీమీటర్, పురుగు మందు తాగితే కక్కించే యంత్రం వాహనంలో అందుబాటులో ఉంటాయి. ఆస్పత్రులకు తరలించే క్రమంలోనే గర్భిణులకు సుఖ ప్రసవాలు చేసిన ఘటనలు అనేకంగా ఉన్నాయి.

అందుబాటులో 33 వాహనాలు

రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 32 అంబులెన్స్‌లు, చిన్న పిల్లల కోసం ప్రత్యేకంగా మరొక వాహనం సేవలు అందిస్తోంది. ఒక్కో వాహనం నిత్యం నాలుగు నుంచి ఐదు ట్రిప్పులు ఘటనా స్థలం నుంచి ఆస్పత్రులకు బాధితులను తరలిస్తున్నాయి. ప్రతీ నెల ఒక్కోవాహనం దాదాపు 150 నుంచి 180 కేసుల వరకు అటెండ్ అవుతున్నాయి.

క్లుప్తంగా

బీజేపీలో చేరిక


బీజేపీలో చేరిన నాయకులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణానికి చెందిన పలువురు నాయకులు ఆదివారం బీజేపీ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆయన సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపే ధ్యేయంగా పనిచేయాలన్నారు. బూత్ స్థాయి నుంచి పార్టీ కార్యకర్తలు కష్టపడి పనిచేయాలన్నారు.

తైక్వాండోలో రెండు వెండి పతకాలు కైవసం


తైక్వాండో పోటీలో పతకాలు సాధించిన రచిత్

పరిగి: రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో పరిగి విద్యార్థి రెండు వెండి పతకాలు సాధించి సత్తా చాటారు. నగరంలోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ 2025 చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో ఆర్‌ఆర్ వరల్డ్ తైక్వాండో అకాడమీ విద్యార్థి మేదర్ రచిత్ (ఆరో తరగతి) తైక్వాండో క్యోరూగి, పూంసే విభాగాల్లో రెండు వెండి పతకాలు సాధించాడు. దీంతో తైక్వాండో అకాడమీ డైరెక్టర్ రాజు, పలువురు విద్యార్థి రచిత్‌ను అభినందించారు.

అన్నదాతకు అపార నష్టం


సయ్యాద్‌పల్లి నీట మునిగిన పత్తి పంట

- అధిక వర్షాలతో దెబ్బతింటున్న పంటలు
- పంటల బీమాపై స్పష్టత కరువు
- ఆదుకోవాలంటున్న రైతులు

పరిగి: విస్తారంగా కురుస్తున్న వర్షాలతో అన్నదాతలకు అపార నష్టం కలుగుతోంది. పంటలు నీట మునిగి కన్నీటిని మిగుల్చుతోంది. ఏటా ఇలా జరుగుతోందని, అయినా ప్రభుత్వం నుంచి ఎలాంటి పరిహారం అందడం లేదని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత వానలతో పరిగి నియోజకవర్గ పరిధి మండలాల్లో భారీగా పంటలు దెబ్బతిన్నాయి. సాధారణ పంటలతో పాటు వర్షాధార ఆధారిత పంటలకు బీమా పథకం లేక పోవడంతో నష్టపోతున్నామని వాపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంటల బీమాపై స్పష్టత ఇవ్వకపోవడంతో ఏటా వర్షాల కారణంగా నష్టపోతున్నామని పేర్కొంటున్నారు. జిల్లా వ్యాప్తంగా రైతులు ఈ ఖరీఫ్‌లో మొక్కజొన్న, వరి, కంది, పత్తి తదితర పంటలను సాగు చేశారు. పంటలు నష్టపోయినప్పుడు అండగా ఉంటుందని భావించిన పథకాలు ఆసరా కాకపోవడంతో దిక్కులు చూస్తున్నారు.

ప్రకటనలకే పరిమితం

పంట బీమా పథకాన్ని ప్రభుత్వాలు అమలు చేయకపోవడంతో వానాకాలంలో పంటలు దెబ్బతిని రైతులు నష్టాన్ని చవిచూస్తున్నారు. పంట నష్టం జరిగితే.. నష్టాన్ని ఫొటో తీసి పంపిస్తే చాలు, తగిన పరిహారం అందజేస్తామని ప్రభుత్వాలు ప్రకటించినప్పటికీ.. ఆచరణలో అమలు కావడం లేదు. వానలు పడి, పడక పంట నష్టపోయినప్పుడు అధికార యంత్రాంగం సర్వే చేసి చేతులు దులుపుకొంటుందని అన్నదాతలు ఆరోపిస్తున్నారు.

వేలాది ఎకరాల్లో నష్టం

భారీ వర్షాలతో మెట్ట పొలాల్లో సాగు చేసిన పంటలు దెబ్బతిన్నాయి. పరిగి, పూడూరు, దోమ, కుల్కచర్ల, చౌడాపూర్ మండలాలు పూర్తిగా వ్యవసాయాధారిత ప్రాంతాలే. ప్రతి గ్రామంలో వందల ఎకరాల్లో రైతులు వివిధ పంటలను సాగు చేస్తుంటారు. నియోజకవర్గంలో సుమారు 1.20 లక్షలకు పైగా మొక్కజొన్న, పత్తి, కందులు, వరి సాగువుతున్నట్లు వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుత ఎడతెరపి లేని వర్షాలతో వాగులు వంకలు పొంగి.. పొలాల్లో నీరు చేరి పంటలు దెబ్బతిన్నాయి. మూడు రోజుల్లో వేల ఎకరాల్లో పంట వర్షార్పణం అయిందని రైతులు తెలిపారు. ఆ పంటలను అధికారులు ఇంకా పరిశీలించలేదు. ఇదే విషయమై వ్యవసాయ అధికారులను వివరాలు కోరేందుకు యత్నించగా.. వారు అందుబాటులోకి రాలేదు.

పరిహారం అందించాలి



అధిక వర్షాలతో రెండేళ్లుగా పంటలు నష్టపోతున్నాను. కనీస పెట్టుబడి కూడా దక్కలేదు. అధికారులు వచ్చి, పంట నష్టపరిహారాన్ని అంచనా వేస్తున్నారు. కానీ ఇప్పటి వరకు ఎలాంటి పరిహారం అందలేదు. దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం అందించాలి.

–పులిందర్‌రెడ్డి, రైతు, సైద్‌పల్లి, పరిగి

అంచనా వేయాలి



వర్షాలకు దెబ్బతిన్న పంటలను వ్యవసాయ అధికారులు పరిశీలించి, నష్టాన్ని అంచనా వేయాలి. అనంతరం ప్రభుత్వానికి నివేదించాలి. కానీ రైతుల గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. ఏటా ఇలాగే జరుగుతోంది. ప్రభుత్వం స్పందించి, పంట నష్ట పోయిన రైతులను ఆదుకోవాలి.

– వెంకటయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి

పౌల్ట్రీ రంగానికి ప్రభుత్వ అండ


ఫెడరేషన్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి తదితరులు

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: పౌల్ట్రీ రంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఈ రంగాన్ని అన్ని విధాలుగా ఆదుకున్నారని, అదే తరహాలో ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి ప్రోత్సాహం ఇస్తారని ఆయన చెప్పారు. తెలంగాణ రాష్ట్ర పౌల్ట్రీ ఫెడరేషన్(టీపీఎఫ్) ఆధ్వర్యంలో పెద్దఅంబర్‌పేట ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో నిర్మించిన 'కల్ బర్డ్ సింగిల్ విండో–5 రీజియన్స్' నూతన భవనాన్ని ఉమ్మడి రాష్ట్ర పౌల్ట్రీ ఫెడరేషన్ మాజీ అధ్యక్షుడు, మాజీ జెడ్పీ చైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డి, టీపీఎఫ్ అధ్యక్షుడు కాసర్ల మోహన్‌రెడ్డి, రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మట్లాడుతూ.. పౌల్ట్రీ రైతుల సమస్యలైన విద్యుత్ సబ్సిడీ, హెచ్‌ఎండీఏ పరిధిలో నిర్మించే షెడ్ పర్మిషన్ విషయాలలో ముఖ్యమంత్రికి వివరించి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటానన్నారు. టీపీఎఫ్ అధ్యక్షుడు మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. భవనం కేవలం ఓ మౌలిక సదుపాయం కాదని, ఏకత్వం, అభివృద్ధి, ఫెడరేషన్ పౌల్ట్రీ రైతులను శక్తివంతం చేయాలన్న అంకితభావానికి ప్రతీక అని అన్నారు. 'కల్ బర్డ్ మార్కెటింగ్'కు కేంద్ర బిందువుగా మారి పారదర్శకత, సమర్థత కలిగిన సేవలను అందించడంలో సహాయపడుతుందని తెలిపారు. పౌల్ట్రీ ఇండియా అధ్యక్షుడు శ్రీ ఉదయ్‌సింగ్ బాయాస్ మాట్లాడుతూ.. సుస్థిర అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని తాము చేస్తున్న ప్రయాణంలో ఇది ఒక కొత్త అధ్యాయానికి శ్రీకారమన్నారు. టీపీఎఫ్ మాజీ అధ్యక్షుడు ఎర్రబెల్లి ప్రదీప్‌కుమార్‌రావు, ఉమ్మడి రాష్ట్ర మాజీ అధ్యక్షు డు దలే సుధాకర్, నెక్ హైదరాబాద్ జోన్ చైర్మన్ గుర్రం చంద్రశేఖర్‌రెడ్డి

అమ్మవారి ఆలయానికి భూమిపూజ

అనంతగిరి: వికారాబాద్ పట్టణం విద్యానగర్ కాలనిలోని పెద్దమ్మ తల్లి దేవాలయ నిర్మాణానికి ఆదివారం స్పీకర్ ప్రసాద్‌కుమార్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు చేయించారు. అర్చకులు అంబదాసు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు నరోత్తంరెడ్డి, బొండాల శ్రీనివాస్, రంగరాజు, పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో మోసం

అమీర్‌పేట: పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ యువతిని గర్భవతిని చేసి మోసం చేసిన వైద్య విద్యార్థిపై ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు నల్గొండ జిల్లా, పలుగుతాండాకు చెందిన యువతి చార్మినార్‌లోని ప్రభుత్వ నిజామియా టీబీ కళాశాలలో బీయూఎంఎస్ చదువుతోంది. గత ఫిబ్రవరిలో ఆమెకు సనత్‌నగర్ ఈఎస్‌ఐసీ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతున్న అనిల్ రాథోడ్‌తో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం ప్రేమకు దారి తీసింది. దీంతో పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఎస్‌ఆర్‌నగర్‌లోని ఓయో లాడ్జికి తీసుకెళ్లాడు. ఫలితంగా సదరు యువతి గర్భం దాల్చింది. అయితే రాథోడ్ ఇటీవల మరో యువతితో సన్నిహితంగా ఉంటున్నట్లు తెలియడంతో బాధితురాలు తనను పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేసింది. అందుకు నిరాకరించడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.

తుక్కు పాలసీ తుస్సు!

నగరంలో భారీగా కాలం చెల్లిన బండ్లు



- వాహనదారుల నుంచి కొరవడిన స్పందన
- పాతవాటిని వదులుకోవడంపై నిరాసక్తత
- ప్రోత్సాహకాలు కల్పిస్తామన్నా పట్టించుకోని వైనం

సాక్షి, సిటీబ్యూరో: కాలం చెల్లిన వాహనాలను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన తుక్కు పాలసీ తుస్సుమంటోంది. 15 ఏళ్లు దాటిన వాహనాలను స్వచ్ఛందంగా తుక్కుగా మార్చే వాహనదారులకు రవాణాశాఖ సముచితమైన ప్రోత్సాహకాలను ప్రకటించినా వాహనదారుల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన రావడం లేదు. ఢిల్లీ వంటి నగరాల్లో కాలం చెల్లిన వాహనాలపై నిర్బంధంగా నిషేధం విధిస్తున్నారు. హైదరాబాద్‌లో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. పాత వాహనాలను తుక్కుగా మార్చేందుకు ప్రత్యేక కేంద్రాలను కూడా ఏర్పాటు చేసినా.. ప్రస్తుతం ఒక నెల వ్యవధిలో కనీసం 25 వాహనాలు కూడా తుక్కు కావడం లేదని అధికారులు చెబుతున్నారు. తుక్కు బండ్లు రోడ్లపై యథేచ్ఛగా తిరుగుతూ పొగలు చిమ్ముతున్నాయి. ప్రమాదకరమైన సల్ఫర్, కార్బన్‌మోనాక్సైడ్ వంటి కాలుష్య కారకాలతో ప్రజారోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టేస్తున్నాయి.

వ్యక్తిగత వాహనాలే టాప్...

- నగరంలో 15 ఏళ్లు దాటిన వాటిలో వ్యక్తిగత వాహనాలే టాప్‌లో ఉన్నాయి. రవాణా శాఖ లెక్కల ప్రకారం సుమారు 17 లక్షల బైక్‌లు, మరో 3.5 లక్షల కార్లు తిరుగుతున్నాయి. రవాణా వాహనాల కేటగిరీలో ఆర్టీసీ బస్సులు, స్కూల్ బస్సులు, ఆటోలు తదితర వాహనాలు సైతం కాల పరిమితి ముగిసిన తర్వాత కూడా వినియోగంలో ఉన్నాయి. ఇవి కాకుండా మరో లక్ష వరకు సరుకు రవాణా వాహనాలు ఉన్నట్లు అంచనా. గ్రేటర్‌లో 13 వేలకుపైగా స్కూల్ వాహనాలు ఉంటే వాటిలో 2500 వరకు డొక్కు బస్సులే.
- సుమారు 1.4 లక్షల ఆటోరిక్షాల్లో కనీసం 25 వేలకు పైగా కాలం చెల్లినవే. ఇవి కాకుండా వెయ్యికి పైగా ఆర్టీసీ బస్సులు, 4 వేల మ్యాక్సీ క్యాబ్‌లు ఉన్నాయి. ఇటు వ్యక్తిగత వాహనాలు, అటు రవాణా వాహనాలు అన్నీ కలిపి 25 లక్షల వరకు ఉన్నట్లు అంచనా. ఈ వాహనాల నుంచి వెలువడే కాలుష్య కారకాల్లో పీఎం స్థాయి 2.5 శాతం వరకు ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వాహనాల కండీషన్ బాగా లేకపోవడం వల్ల, ఇంజన్ దెబ్బతినడం, బ్రేకులు ఫెయిల్ కావడం వంటి కారణాల వల్ల రోడ్డు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి.

గ్రీన్ ట్యాక్స్ చెల్లిస్తే సరి..

- మోటారు వాహన చట్టం ప్రకారం 15 ఏళ్లు దాటిన రవాణా వాహనాలు గ్రీన్‌ట్యాక్స్ చెల్లించి మరో 5 ఏళ్ల వరకు రెన్యువల్ చేసుకోవచ్చు. 20 ఏళ్లు దాటిన వ్యక్తిగత వాహనాలకు సైతం రిజిస్ట్రేషన్ పునరుద్ధరణ సదుపాయం ఉంది.
- ఈ వెసులుబాటుతో స్వచ్ఛంద స్క్రాపింగ్‌కు స్పందన రావడం లేదు. చాలామంది రెండో వాహనం ఉన్నప్పటికీ మొదటి వాహనాన్ని వదులుకోవడానికి నిరాకరిస్తున్నారు. ఒక ఇంట్లో ఒక పాత కారు, ఒక కొత్త కారు తప్పనిసరి అవసరంగా వినియోగిస్తున్నారు.
- ద్విచక్ర వాహనాల విషయంలోనూ పాతవి, కొత్తవి ఉంటున్నాయి. కానీ పాతవాటిని మాత్రం వదులుకోవడం లేదు.

ప్రోత్సాహకాలు ఇలా..

- కాలపరిమితి ముగిసిన వాహనాలను స్వచ్ఛందంగా తుక్కుగా మార్చుకొనే వాహనదారులకు కొత్తవాటి కొనుగోళ్లలో ప్రభుత్వం సముచితమైన ప్రోత్సాహాన్ని అందజేస్తుంది
- కొత్త వాహనాల జీవితకాల పన్నులో రాయితీని ఇస్తున్నారు.
- రూ.5 లక్షల విలువైన వాహనాల కొనుగోలుపై రూ.10 వేల రాయితీ ఉంటుంది
- రూ.5- 10 లక్షల ఖరీదైన వాహనాలపై రూ.20,000
- రూ.10-15 లక్షల ఖరీదు చేసేవాటిపై రూ.30,000
- రూ.15- 20 లక్షల వరకు విలువైన వాహనాలను కొనుగోలు చేస్తే రూ.40,000 చొప్పున రాయితీ ఇస్తారు.
- తమ పాత వాహనాల తుక్కు సర్టిఫికెట్‌లను ఆర్టీఏలో అందజేస్తే ఈ రాయితీ లభిస్తుంది.

ప్రాజెక్టు అలుగుపై గుంతల పరిశీలన


కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగు రోడ్డును పరిశీలిస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మధుసూదన్‌రెడ్డి

ధారూరు: మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్టును ఆదివారం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మధుసూదన్‌రెడ్డి పరిశీలించారు. ప్రాజెక్టు అలుగు సీసీ రోడ్డుపై పడిన గుంతలను ముందుగా తనిఖీ చేశారు. ప్రాజెక్టులో ప్రస్తుతం ఉన్న నీటి నిల్వను పరిశీలించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు వాగుల ద్వారా ఏ మేరకు నీరు వస్తుందని డీఈ భాస్కర్‌గౌడ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఔట్‌ఫ్లో ఎన్ని క్యూసెక్కుల నీటిని బయటకు వదులుతారని ప్రశ్నించారు. ప్రస్తుతం ప్రాజెక్టులోని నీటిని వానాకాలం పంటలకు కుడి, ఎడమ కాల్వలతో పాటు బీబీకెనాల్‌కు విడుదల చేసినట్లు భాస్కర్‌గౌడ్ వివరించారు. ప్రాజెక్టు నీటి నిల్వ కెపాసిటీ ఎంత వంటి వివరాలను మధుసూదన్‌రెడ్డి తెలుసుకున్నారు. 9,200 ఎకరాలకు నీరందించాల్సిన ప్రాజెక్టు ప్రస్తుతం 5వేల ఎకరాలకే పరిమితమైందని డీఈ వివరించారు. ప్రాజెక్టు నిండిన వెంటనే ఔట్‌ఫ్లో ప్రారంభమవుతుందన్నారు. ఆయన ఏఈఈ రవితేజ, వర్క్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు ఉన్నారు.

గుంతలమయంగా రోడ్డు!

- పట్టించుకోని అధికారులు
- వరినాట్లు వేసి నిరసన


రోడ్డు మధ్య గుంతలోచేరిన నీటిలో వరి నాట్లు వేసి నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

పూడూరు: అంగడిచిట్టంపల్లి–కంకల్–లాల్‌పహాడ్ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. ఈ విషయాన్ని అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని మండల బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం అక్కడ రోడ్డు మధ్య గుంతలో చేరిన నీటిలో వరి నాట్లు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీజేపి జిల్లా అధికార ప్రతినిధి రవీందర్ మాట్లాడుతూ గుంతగా తయారైన రోడ్డుపై ప్రయాణించాలంటే ప్రతీరోజు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దారిలో బస్సులు, ప్రైవేటు వాహనాలు సైతం గ్రామాలకు రావడం లేదన్నారు. దీంతో విద్యార్థులు, రోజువారి పనులకు వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండల పరిధిలోని గ్రామాలకు వెళ్లే బీటీ రోడ్ల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. ఆర్ అండ్‌బీ అధికారులు స్పందించి కనీసం గుంతల్లో మట్టి పోయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కన్నయెళ్ల రాజు, రామచంద్రయ్య, అశోక్, రాజు, శ్రీశైలం, నర్సింలు, మనోహర్‌గౌడ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు దాటుతుండగా ఘోర ప్రమాదం

- బైక్‌ను ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు
- ఒకరి దుర్మరణం


కనకయ్య (ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రైవేట్ ట్రావెల్ బస్సు, బైక్‌ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా మర్రిగూడ మండలం కొండూరు గ్రామానికి చెందిన సిలివేరు కనకయ్య(45) తన భార్య స్వప్న, కుమార్తెతో కలిసి కొన్నేళ్లుగా తుర్కయంజాల్ మున్సిపాలిటీ తొర్రూర్‌లో టిఫిన్ సెంటర్ ఏర్పాటు చేసుకొని కమ్మగూడలో నివాసం ఉంటున్నాడు. శనివారం రాత్రి ఇంట్లో భోజనం చేస్తుండగా ఫోన్ రావడంతో డబ్బులు తీసుకోవడానికి వెళ్తున్నానని భార్యకు చెప్పి కనకయ్య బయటికి వెళ్లాడు. అర్ధరాత్రి వేళ ఎస్‌ఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్ వద్ద రోడ్డు దాటుతున్న కనకయ్య ద్విచక్ర వాహనాన్ని వేగంగా వచ్చిన హరికృష్ణ ట్రావెల్ బస్సు ఢీకొట్టింది. దీంతో ఆయన అక్కడిక్కడే దుర్మరణం చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలి

టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య


సభ్యత్వం అందజేస్తున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య తదితరులు

షాద్‌నగర్‌రూరల్: జర్నలిస్టుల పట్ల పాలకులు చూపుతున్న వివక్షను ఐకమత్యంతో ప్రతిఘటించాలని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అన్నారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని నాగులపల్లి శివారులోని ఓ రిసార్ట్స్‌లో టీడబ్ల్యూజేఎఫ్ షాద్‌నగర్ అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్ అధ్యక్షతన డివిజన్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. టీయూడబ్ల్యూజే–143 యూనియన్ నాయకులు టీడబ్ల్యూజేఎఫ్‌లో చేరారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, జిల్లా కార్యదర్శి సైదులు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తుందని ఆరోపించారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ జాప్యాన్ని నిరసిస్తూ త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టుల చైతన్య యాత్రను చేపడతామని తెలిపారు. సర్కారు కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, అక్రిడేషన్ కార్డులు, హెల్త్ కార్డులు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, జాతీయ కౌన్సిల్ సభ్యులు రామారావు, దేవేందర్, నాయకులు రఘుపతి, గణేష్, చంద్రశేఖర్, శ్రీనివాసచారి, డివిజన్ స్థాయి జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.


అనంతగిరి: ట్రెక్కింగ్ చేస్తున్న పర్యాటకులు


అనంతగిరి: వాచ్ టవర్ వద్ద పర్యాటకుల సందడి

ప్రాజెక్టులకు పర్యాటకుల తాకిడి

వికారాబాద్ సమీపంలోని అనంతగిరి గుట్ట, ధారూరు కోట్‌పల్లి ప్రాజెక్టుకు ఆదివారం పర్యాటకుల తాకిడి పెరిగింది. ఉదయం అనంతగిరి, ధారూరుకు వచ్చి అడవుల్లో విహరిస్తూ ఆనందంగా గడిపారు. స్నేహితులతో, కుటుంబీకులతో వచ్చి సరదాగా సాయంత్రం వరకు ఎంజాయ్ చేశారు. అనంతరం సెల్ఫీలతో ఫొటోలకు ఫోజులిచ్చారు.


ధారూరు: ప్రాజెక్టు ఒడ్డున ఫొటో తీస్తున్న యువతి


ధారూరు: ప్రాజెక్టు నీటిలో బోటింగ్ చేస్తున్న యువత